
కథ

# నల్ల ఛత్రి

వేంపల్లి గంగాధర్

**గాలి ఎత్తుకొనింది. గంగమ్మ గుడి మోట్లోని కానుగచెట్టు దెయ్యం పట్టినదానిలా కొమ్మల్ని విరబోసుకొని ఊగుతోంది. మొబ్బుల ముసుగును ఆకాశం కప్పుకుంటోంది. చినుకులు కురవడం మొదలైంది. దిగువ ఇండ్ల కాన్నుంచి ఎగువ ఇండ్ల దిక్కు వుండే ఎఱ్రమట్టి దావ వానచినుకులకు బురద బురదగా తయారైంది. ఆ దారెంబడి రోజూ ఇటుకల బట్టీల నుంచి ఎద్దుల బండ్లు పోయినదానికి గుర్తుగా ఏర్పడిన గుంతల్లోకి వాననీళ్ళు వచ్చి చేరుతున్నాయి.**

కొండకు ఉదయాన్నెప్పుడో కట్టెలుకు పోయినోళ్లు నెత్తి మీద మోపులు పెట్టుకొని తడిసిన బట్టలతో వడివడిగా అడుగులు వేసుకుంటూ గుడిసెల దగ్గరికి వస్తున్నారు. నాల్గు రోజుల్నుంచి సాయంత్రమైతే చాలు వాన చిన్నగా మొదలై పెద్దగా రూపాంతరం చెంది ఎక్కడ గుడిసె వాసాలు విరిగి కూలిపోతాయో అనేంతగా కలవరపెడ్తానే వుంది. చీకి చెట్లలో నుంచి జీరంగులు పోటీలు పడి శబ్దం చేస్తున్నాయి.



దూరంగా ఎక్కడో పిడుగు పడిన శబ్దం... చెక్కతలుపు తోసుకొని గుడిసెలోకి వేగంగా వచ్చాడు అంకన్న. లోపల గుంజకు ఆనుకొని వెచ్చగా బీడీపొగ వదుల్తున్నాడు కొండయ్య. మరో గుంజకు ఆనించి వున్న నులక మంచంలో ఒక వైపుకు తిరిగి చినిగిపోయిన పాత రగ్గును మెడ వరకు కప్పుకొని మూల్గుతోంది కొండయ్య పెండ్లాం ఓబులమ్మ.

'రేయ్... రోశిరెడ్డయ్య పిలుస్తాండడు. నువ్వూ, నీ పెండ్లాం ఇద్దరూ ఇంటికాడికి రావాలంట. రోంత బిరబిరా కదలండి' అని ఏదో ముఖ్యమైన పని మీదనే వచ్చినట్లు కేకేసినాడు అంకన్న.

'సరేలేన్నా... ముందు మంచం మీద కూకో. బీడీ తాగిపోదాం గానీ... ఆ యమ్మికి రేత్రి నుంచి పేణం బాగోలేదు. అదో అట్టా ముదర చుట్టుకొని పండుకొని వుండాది...' చెప్పినాడు ఆరిపోయిన బీడీని అగ్గిపుల్ల గీసి మళ్ళా మండించుకుంటా కొండయ్య.

'ఏమోరా... సామీ... పెద్దయ్య ఇద్దర్ని పిల్సకరమ్మని చెప్పినాడు. సంగతేందో తెలీదు. ముందు ఆడికి పోదాం పా... ఆ యమ్మిని గూడా లేపు. పిల్సకపోదాం...' నులక మంచం మీద కూర్చోకుండానే చెప్పినాడు అంకన్న.

ఈ మాటలు విని ఓబులమ్మ దగ్గుతా పైకి లేచి కూర్చోనింది.

'ఏమ్మి... ఏమైంది?' అడిగినాడు అంకన్న తడిసిన తలను తుండుగుడ్డతో తుడ్సుకుంటా.

'నిన్న కొట్టంబోదగడ్డి కోసరం కొండకు పోయింటిన్నా... వచ్చినకాన్నుంచి సలి, జొరం పట్టుకొనింది' అని జావాబిచ్చింది దగ్గుతానే.

'వున్నిలే అట్నే ఆ రగ్గు నెత్తికి సుట్టుకొని బిన్నా ఎలబారి రచ్చబండ దావ కాన్నుంచి బండల దావెంబడి రోశిరెడ్డయ్య ఇంటి కాడికి పా...' చెప్పినాడు అంకన్న.

ఓబులమ్మ మూల్గుతా ఎదురేం చెప్పకుండానే పాత రగ్గు చుట్టుకొని తల మీదకు కూడా రోంత సర్దుకొని బురద నీళ్ళలో అడుగులో అడుగు వేసుకుంటా కదిలిపోయింది.

అయిపోయిన బీడీని బయటకు విసిరేసి చెక్క తలుపును దగ్గరికి లాగి మలతాడుకు కట్టుకున్న తాళంతో బీగంవేసి అంకన్నతో పాటూ తలకు తుండుగుడ్డ కట్టుకొని వానలో బయలుదేరినాడు కొండయ్య గూడా.

నల్ల మోడాల ఆకాశం మెరుస్తానే వుంది. ఆగి ఆగి ఉరుముతానే వుంది. విసురుగా వీస్తున్న గాలికి, వానకు బురదలో నడవడం అలవాటైనా కొంత కష్టంగానే వుంది ఇద్దరికీ. దిగువ ఇండ్లలోంచి రచ్చబండ వరకు ఎఱ్రమట్టి దావ దాటుకుంటే అక్కడ్నుంచి ఎగువ ఇండ్లలోకి బండలు పరిచి వుంటాయి.

ఇంటి మిద్దెల పైనుంచి గొట్టాల ద్వారా పడే వాననీళ్ళను కొంత చూసుకొనిపోవాలి. చీకటిగా వుంది. ఎక్కడైన కరెంటు తీగలు తెగిపడి వుండవచ్చు. జాగ్రత్తగా చూసుకొని వెళ్ళాలి. వెనుక వైపునుంచి అలాగే ముగ్గురూ రోశిరెడ్డి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. వాన పడ్తానే వుంది. వెనుక వుండే దావ గుండా పశువుల కొట్టంలోకి చేరుకున్నారు. కోడెలు వెచ్చగా గడ్డి మేస్తున్నాయి. లోగా ఇంట్లో టీవీ చూస్తున్న రోశిరెడ్డి ఏదో నములుతా నల్లఛత్రి పట్టుకొని పశువుల కొట్టం దగ్గరికి వచ్చాడు. నవ్వాడు. పలకరించాడు. 'నేను పట్టుకుంటానయ్యా. నా సేతికియ్యి' అని ఎప్పటిలాగానే తనకు బాగా

అలవాటైన మాటను అన్నాడు కొండయ్య రోశిరెడ్డి చేతిలోని నల్ల ఛత్రిని చూసి!

***

కొండయ్యకు తన తండ్రి లింగన్న, రోశిరెడ్డి నాయన అంకిరెడ్డి దగ్గర ఎంతో నమ్మకమైన జీతగాడిగా వుండేటోడు. పాపాఘ్ని యేరుకు ఆనుకొని వుండే బంజరు భూమికి కంచె వేసి ఆక్రమించే టప్పుడు కట్ట మీద అంకిరెడ్డి మీసాలు దువ్వుకుంటా, తెల్లని మల్లెపువ్వు లాంటి ఖద్దరు దుస్తులు ధరించి కరణం కుర్చీలో కూర్చోని వుండేవాడు.

అయ్యకు వెనుక వైపున తన తండ్రి లింగన్న నల్ల ఛత్రి పట్టుకొని ఎండా, వానకు తడ్సుకుంటా నిబ్బరంగా నిలబడి వుండే దృశ్యం తానెప్పటికీ మర్చిపోలేడు. తన తల్లి కూడా కంచె బిగించే పనికి తనని చెయ్యి పట్టుకొని తీసుకొని వెళ్ళేది. కొండయ్య దగ్గర్లోని రెడ్డోరి మామిడి తోట లోకి దాక్కొని వెళ్ళేవాడు. కాపలావాళ్ళు వెంటపడితే భయంగా పరుగందుకునేవాడు. వాళ్ళు వెంబడించి పట్టుకొని నిలదీస్తే దూరంగా కట్ట మీద రెడ్డోరికి నల్లఛత్రి పట్టుకొని నిలబడి వుండే తన తండ్రిని చూపించేవాడు అమాయకంగా.

'ఓర్ని... పిల్లోడా! నువ్వు మా లింగన్న కొడుకువా... తులవనాబట్ట... రా... మీ నాయనకేంరా... పొద్దున లేసి నా ముంచి, రేత్రి నిద్దరబోయే వరకు అయ్యకాడ్నే నల్ల ఛత్రి పట్టుకొని నిలబడి వుంటాడు. నమ్మక మంటే పెద్దోళ్ళ దగ్గర నువ్వు గూడా అట్టా సంపాదించుకోవాల. తోటలెంబడి, సేలంబడి, తిరిగి పాపర్నా కొడుకివి అనిపించుకోవాకు' అని బుద్ధిమాటలు చెప్పి చేతిసంచికి మోసేన్ని మామిడిపండ్లు పెట్టి యిస్తాండిరి.

ప్రతి సంవత్సరం సంక్రాంతి పండక్కి ఇంటిల్లిపాదికి కొత్త బట్టలు రెడ్డోరు కుట్టిస్తాండిరి. కల్లంకాడికి గంప ఎత్తకపోయి తిండిగింజలు తల్లి తెస్తా వున్నింది. అంకిరెడ్డయ్య టౌనుకు లింగన్నను ఒకసారి పిల్సకపోతే వాడు అక్కడ కూడా నల్లఛత్రి వెనకెమ్మోడి పడ్తానని మొండి పట్టు పట్టినాడు. వద్దంటాంటే గూడా వినకుండా అలిగినాడు. వాడ్ని ఎందుకు బాధ పెట్టడమని రెడ్డోరు 'సరే'నని తలాడించినారు. అంతే అంత జనంలో మార్కెట్టు దగ్గర ఒకరికి కళ్ళు పొడిచినాడు పొరపాటున ఛత్రితో. వాళ్ళతో కొట్లాడి అన్నుంచి పల్లెకు రావాల్సి వచ్చింది. ఇప్పటికీ పల్లెలో ఈ సంఘటన ను చెప్పుకొని నవ్వుకుంటా వుంటారు.

రెడ్డోరిచ్చిన జాగాలోనే లింగన్న కొట్టం కట్టుకున్నాడు. గంగమ్మ దేవళం కట్టించింది, రాళ్ళబావి తవ్వించింది కూడా అంకిరెడ్డయ్యనే. అప్పుడు పల్లెలో ఒకే పార్టీ వుండేది. అయ్య ఏ గుర్తుకు ఓటు వేయమంటే చుట్టుపక్క వుండే పల్లెలన్నీ అదే గుర్తుకు ఓట్లు వేసేవి. ఆయన మాటకు అడ్డుండేది కాదు. ఎవరికి ఏ కష్టమొచ్చినా, ఏ నష్టం జరిగినా రచ్చబండ రాగిచెట్టు కింద పంచాయితీ జరుగుతా వున్నింది. సమస్యలు పరిష్కారమవుతా వుండేవి. ఎదురు చెప్పేవాళ్ళని, మాట విననివాళ్ళని ఊరి బహిష్కరణ చేస్తాండిరి. అంకిరెడ్డి మంచోడు కాదు. చెడ్డోడు కాదు. మధ్యరకం మనిషి. భూమి పిచ్చితో ఎప్పుడూ తనకలాడేటోడు.

పాపాఘ్ని నది ఎంత దూరం ప్రవహిస్తా పోతాందో దానికి ఆనుకొని కట్టవెంబడి వుండే భూమికోసం ఆరాటపడినాడు. కానీ వీరాపురం రైతులు పోరాటానికి వచ్చినారు. రాత్రికి రాత్రి పాతిన రాతిస్తంభాలు, ముళ్ళకంచె తీగను పెరికేసి 'ఈ భూమి మాదని' ఎదురు తిరిగినారు. అన్నుంచి అగ్గి రగులుతా వచ్చింది. వీరాపురం సర్పంచు లంకనాయుడుకి ముగింపు పలికే కార్యక్రమంలో భాగంగా జింకల కొండ దగ్గర కోడిపందాలు ఆడే స్థలాన్ని వేదికగా చేసుకొని తన మనుషులతో వ్యూహం చేసినాడు అంకిరెడ్డి.

ఇంకేముందాది? చూస్తాండగానే పదునైన వేట కొడవళ్ళు రక్తదాహం తీర్చుకున్నాయి.

ఆ కత అక్కడితోనే ముగియలేదు. చీనీ చెట్లు నరుక్కోవడం, గడ్డివాముల్ని కాల్చివేయడం, ఆవులకు విషం పెట్టడం వంటి సంఘటనలతోనే ఆ కక్షలు చల్లరనూ లేదు.

పాపాఘ్ని నది ఎంత దూరం ప్రవహిస్తా పోతాందో దానికి ఆనుకొని కట్టవెంబడి వుండే భూమికోసం ఆరాటపడినాడు. కానీ వీరాపురం రైతులు పోరాటానికి వచ్చినారు. రాత్రికి రాత్రి పాతిన రాతిస్తంభాలు, ముళ్ళకంచె తీగను పెరికేసి 'ఈ భూమి మాదని' ఎదురు తిరిగినారు. అన్నుంచి అగ్గి రగులుతా వచ్చింది.

లంకనాయుడి పెద్దకొడుకు సిద్దినాయుడు నిద్ర పోలేదు. పగ పట్టి పది సంవత్సరాల తర్వాత అంకిరెడ్డి రాత్రి ఆఖరి బస్సుకు దిగి ఇంటికొస్తాండేటప్పుడు మూడేపమాన్ల సత్రం దగ్గర కాపుకాసి నాటుబాంబులేసినారు. దావలోనే అంకిరెడ్డి ముక్కలు ముక్కలుగా ఎగిరిపడినాడు. అట్నే వెనక నల్లఛత్రి పట్టా వస్తాండే లింగన్న గూడా తునాతునకలై రక్తపు మడుగులో కన్ను మూసినాడు.

అంకిరెడ్డిని చీనితోటలో పెద్ద సమాధి చేసినారు.



లింగన్నను పాపాఘ్ని ఏట్లో ఇసుకలో కప్పెట్టినారు.

ఆ తర్వాత కాలం ఆగిపోలేదు. కక్షలు మాసిపోలేదు. కరణం కుర్చీలో పెద్దకొడుకు రోశిరెడ్డి కూర్చున్నాడు. వెనుక నల్లఛత్రి పట్టా కొండయ్య నిల్చున్నాడు.

రోశిరెడ్డి రాజకీయమే వేరు. గవర్నమెంటువాళ్ళు చేసే పనులన్నీ తానే చేయిస్తున్నట్లు పల్లెలో ప్రచారం చేసుకునేటోడు. బడిని విద్యాశాఖవాళ్ళు మంజూరు చేస్తే తానే పోరాడి తీసుకొచ్చినట్లు, పశువుల ఆసుపత్రిని తానే టౌన్లోని ఆఫీసర్లతో మాట్లాడి వేయించినట్లు చెప్పుకుంటా వచ్చినాడు. కుమ్మరోళ్ళ సాంబయ్య పేరు మీద వచ్చిన స్టోర్‌ను తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. బియ్యం, కిరసనాయిలు, చెక్కర అన్నీ

కొంతమందికే ఇచ్చి స్టాక్ అయిపోయిందని చెప్తాండిరి. నీళ్ళట్యాంకు పని కాంట్రాక్టు చేసినాడు. బడి బిల్డింగ్ పని తెచ్చుకున్నాడు. బాగా సంపాదించినాడు.

ఎగువ గండికోట ప్రాజెక్టు రావడంతో ఖాళీ చేయించిన గ్రామాలోల్లకు ఈ పల్లెలోనే పునరావాసం కల్పించింది ప్రభుత్వం. ముంపు వాసులందరికీ ఇంటిస్థలాలు, రుణాలు మంజూరైనాయి. వీరాపురంవాళ్ళు ఈ పల్లెలోకే వచ్చినారు. పల్లెలో ఓట్లు పెరిగాయి. లంకనాయుడి పెద్దకొడుకు సిద్ధినాయుడు పోటీకి కోట లాంటి మేడ కట్టినాడు. జనాన్ని కూడగట్టినాడు. ఎమ్మెల్యేతో మాట్లాడి ఇండ్లు ఇప్పించినాడు. ఇంటింటికి తెల్లకార్డులిప్పిచ్చినాడు. ఈసారి ఎన్నికలు వస్తే తన అల్లుడికి టిక్కెట్టు ఇప్పించుకోవడానికి ఇప్పటినుంచే ప్రయత్నాలు మొదలెట్టినాడు.

దిగువ ఇండ్లలోని పెద్దతాత కూడా కొడుకును టౌన్లో డిగ్రీ చదివించేందుకు నాయుడి దగ్గరికి పోయి సాయం కోరినాడు.

'నువ్వేం దిగులు పడాకు తాత. నీ కొడుకు అబ్బిగాడ్ని నేనే నా స్వంత ఖర్చులతో చదివిస్తా. హాస్టల్‌లో చేర్పిస్తా. బాగా చదువుకున్నాక నా ఫ్యాక్టరీలోనే పనికి గూడా పెట్టుకుంటా' అని భరోసా ఇచ్చినాడు నాయుడు.

ఇట్నే అంజయ్య, తిరుపాలు, మహదేవుడి కొడుకులు కూడా టౌన్లో నాయుడి సాయంతోనే చదువుకుంటా వుండారు.

పోయిన వారం రోశిరెడ్డిని 'తన కొడుకు గుర్రయ్యగాడ్ని టౌన్లో కాలేజీ చదివించే విషయమే' కొండయ్య ఎత్తిడ్సి చూసినాడు.

'ఆ నాయుడు ఓట్ల కోసం మీకు గాలం వేస్తాండడు. మీ మీద ప్రేమతోనో, అభిమానంతోనో కాదు. ఎంత చదువుకుంటే మాత్రం ఇప్పుడు ఉద్యోగాలు ఎక్కడొస్తాండయి? నువ్వు అంతగా నోరు తెరిచి అడుగుతా వుండావు కాబట్టి సాయం చేస్తాలేనని' రోశిరెడ్డి హామీ ఇచ్చినాడు.

'ఇండ్లలో యింగ ఎవర్తోనూ ఈ మాట అనొద్దు. అందరొచ్చి నా పైన పడ్తారు' అని కూడా హెచ్చరించినాడు.

సర్పంచి ఓట్లు వస్తా వుండాయని ఈ రోజు ప్రొద్దున్నే అల్లుడ్ని వెంట పెట్టుకొని దిగువ ఇండ్లలోకి ప్రచారానికి వచ్చినాడు నాయుడు.

నాయుడ్ని రాజకీయంగా ఎలా దెబ్బ కొట్టాలని ఆలోచించిన రోశిరెడ్డికి సాయంత్రానికి ఒక యోచన తట్టింది. అందుకే యింత వర్షంలోనూ కొండయ్య ఇంటి దగ్గరికి మనిషిని పంపించాడు. పిలిపించాడు.


***

బయట ఆగకుండా వర్షం కురుస్తూనే వుంది. రోశిరెడ్డి చెప్పడం మొదలెట్టాడు.

"రేయ్ కొండయ్య. నేను చెప్పేది రోంత జాగ్రత్తగా విను. నువ్వూ, నీ పెండ్లాం ఇద్దరూ మండలానికి పొండి. పోలీస్ స్టేషన్‌కు కొత్త ఎస్సై మనోడే వచ్చినాడు. మీకేం భయం లేదు. ఈ రోజు పొద్దున ప్రచారానికి దిగువ ఇండ్లలోకి వచ్చిన నాయుడు, వాడి అల్లుడు నీ పెండ్లాన్ని అనుభవించేదానికి పూనుకున్యట్లు ఎస్సీ ఎస్టీ యాక్ట్ పెట్టు. దీనిచేత కూడా వేలిముద్ర వేయించు. నేను ఫోన్‌లో ఇప్పుడే ఎస్సైతో మాట్లాడినాను. యింగ జరగాల్సిదంతా వాళ్ళు చూసుకుంటారు. ఈ దెబ్బతో వాడు నామరూపాలు లేకుండా పోవాల...' అని పళ్ళు పటపటా కొరికినాడు రోశిరెడ్డి. దూరంగా ఎక్కడో పొడుగు పడిన శబ్దం.

'అంకన్నగాడ్ని తోడు పిల్సకపోండి'-అని చెప్తానే జీపు కూడా బయట సిద్ధం చేయించినాడు. కొండయ్యకు ఒంట్లో వణుకు పుడుతోంది. ఈదురుగాలి ఆగకుండా వీస్తోంది. తనెప్పుడూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది లేదు. పోలీసులతో ధైర్యంగా మాట్లాడింది లేదు. తనకు తెల్సిన పని ఒక్కటే రెడ్డోరికి నల్ల ఛత్రి పట్టడం. ఇప్పుడు ఇలా మొదటిసారి అయ్యకోసం...

జీపులైట్లు వెలిగాయి. ఇనుపగేటు తెరచుకుంది. వెనుక వైపు దించిన ప్లాస్టిక్ తెరలు ఎత్తి ముగ్గురూ జీపు ఎక్కారు. వర్షం కురుస్తూనే వుంది. దారికిరువైపులా వుండే చీనీ చెట్లు జీపును రాసుకుంటూ శబ్దం



ఎగువ గండికోట ప్రాజెక్టు రావడంతో ఖాళీ చేయించిన గ్రామాలోల్లకు ఈ పల్లెలోనే పునరావాసం కల్పించింది ప్రభుత్వం. ముంపు వాసులందరికీ ఇంటిస్థలాలు, రుణాలు మంజూరైనాయి. వీరాపురంవాళ్ళు ఈ పల్లెలోకే వచ్చినారు. పల్లెలో ఓట్లు పెరిగాయి. లంకనాయుడి పెద్దకొడుకు సిద్ధినాయుడు పోటీకి కోట లాంటి మేడ కట్టినాడు. జనాన్ని కూడగట్టినాడు. ఎమ్మెల్యేతో మాట్లాడి ఇండ్లు ఇప్పించినాడు. ఇంటింటికి తెల్లకార్డులిప్పిచ్చినాడు.

చేస్తున్నాయి.

ఓబులమ్మ నోటికి పాత రగ్గు అడ్డు పెట్టుకొని దగ్గుతూనే వుంది.

మరో అరగంట గడిచేసరికి జీపు స్టేషన్ ముందు ఆగింది. కొండయ్య, ఓబుళమ్మ, అంకన్న ముగ్గురూ స్టేషన్‌లోకి నడిచారు. భయం భయంగా వుంది. బయట కాసేపు నిలబడ్డారు.

పోలీసాయన వచ్చి లోపలికి తీసుకెళ్ళాడు. అప్పటికే టైపు చేసి ఉంచిన కాగితం మీద ఓబుళమ్మ వేలిముద్ర వేసింది. ఇద్దరూ సాక్షి సంతకాలు చేశారు.

బయట అరుగు మీద కూర్చోమని చెప్పారు.

పోలీసు జీపొకటి నలుగురు కానిస్టేబుళ్ళతో పల్లెదిక్కు కదిలిపోయింది. లోపల్నుంచి ఎస్సై ఫోన్లో ఎవర్తోనో మాట్లాడే మాటలు లీలగా విన్పిస్తున్నాయి.

'మనం అనుకుంటే కేసును ఇంకొంత బలంగా ప్లాన్ చేయవచ్చు. అదేం పెద్ద కత కాదు కొంత ఖర్చు అవుతుంది. రిస్క్ రాకుండా మీరే చూసుకోవాలి... సరే...సరే...' అని మాత్రం వినపడింది. ఆ తర్వాత ఏం మాట్లాడాడో తెలీదు.

ఎస్సై బయటికొచ్చి యిక మీరందరూ వెళ్ళిపోవచ్చు కేసు పెట్టిన ఆమె భర్త మాత్రం యిక్కడుంటే చాలని చెప్పాడు. 'తెల్లారి పంపిస్తానంతే' అని కూడా చెప్పాడు. దగ్గుతున్న ఓబులమ్మను రెక్క పట్టుకొని వెనుక జీపులో కూర్చోబెట్టాడు కొండయ్య. ఎక్కడో పిడుగు పడిన శబ్దం. అంకన్న కూడా ఎక్కి కూర్చున్నాడు.

జీపు కదిలింది.

***

తెల్లారిన తర్వాత పల్లెంతా ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు. ఎప్పుడో ఆరిపోయిన కక్షలు మళ్ళీ పుంజుకున్నాయని

జనం భయపడిపోతా వుండారు.

నాయుడ్ని, అతడి అల్లుడిని పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు. విచారణ కొన సాగుతోంది. ఓబులమ్మను కూడా స్టేషన్‌కు మళ్ళీ తీసుకెళ్ళారు.

కానీ కొండయ్య అక్కడ లేడు.

వాడి గురించిన సమాచారమూ లేదు.

ఎవరు పట్టించుకుంటారు? రెండు మూడుసార్లు ఓబులమ్మ అడిగింది కానీ ఎవరూ ఆమెకు జవాబివ్వలేదు. సాయంత్రానికి కొండయ్య సంగతి బయట పడింది.

పాపాఘ్ని మోరీ కింద శవం గుర్తించినారు. నెంబ్రాయితో తల మీద మోది చంపినట్లు తేల్చారు.

'కేసు పెట్టి వెళ్తున్నరాత్రి నాయుడు మనుషులే కాపు కాచి కొండయ్యను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు... నిమ్మళంగా!

హత్యకేసు, అత్యాచారంకేసు రెండూ నమోదైనాయి. కేసు బలంగా తయారైంది.

స్టేషన్లో ఒక మూల చేతులు కట్టుకొని కూలబడి చలి జ్వరంతో వణుకుతూ కూలబడి వున్న ఓబులమ్మ, కొండయ్య మరణ వార్త విని కుప్పకూలిపోయింది.

టౌన్లో డిగ్రీ చదువుతున్న కొండయ్య కొడుకు గుర్రయ్య ఏడ్చుకుంటా స్టేషన్లోంకి వచ్చాడు. తల్లికి కుండలో నీళ్ళు ముంచి తాపి చిన్నగా నడిపించుకుంటా స్టేషన్ బయట వున్న చింతచెట్టు కింద కూర్చో బెట్టాడు. వాడికి ఏవేవో ప్రశ్నలు అడగాలని వుంది. చెట్టుకొమ్మల్లో రాత్రంతా తడిసిన పక్షులు రెక్కలాడించుకుంటూ వింత వింత శబ్దాలు చేస్తున్నాయి.

చెట్టు దగ్గరికి నాయుడు మనిషి ఒకడొచ్చాడు.

'రేయ్... రబ్బీ! మీ నాయన్ను చంపాల్సిన అవసరం నాయుడికేముండాది? ఆ రోశిరెడ్డినే కేసు బలం గావాలని ప్లానేసి లేపిచ్చినాడు. నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం' అని చెప్పిపోయినాడు.

చెట్టు మీది పక్షులు మొత్తుకుంటానే వుండాయి. అంకన్నమామ వచ్చినాడు.

**టౌన్లో డిగ్రీ చదువుతున్న కొండయ్య కొడుకు గుర్రయ్య ఏడ్చుకుంటా స్టేషన్లోంకి వచ్చాడు. తల్లికి కుండ లో నీళ్ళు ముంచి తాపి చిన్నగా నడిపించుకుంటా స్టేషన్ బయట వున్న చింతచెట్టు కింద కూర్చో బెట్టాడు. వాడికి ఏవేవో ప్రశ్నలు అడగాలని వుంది.**

'అబ్బీ! ఆ నాయుడు పగనా కొడుకు. మీయమ్మ కేసు పెట్టిందని, రేత్రి మీ నాయన స్టేషనుకాన్నుంచి పల్లె కొస్తాండేటప్పుడు కాపు కాసి వేయిచ్చినాడు. ఇది నువ్వు మర్సిపోగాకు' అని చెప్పినాడు మాను మోట్లోని బండరాయి మీద కూర్చుంటా.

ఏది సత్యం? ఏదసత్యం?

రోశిరెడ్డి జీపొచ్చి స్టేషన్‌కాడ నిలబడింది.

జనమందరూ గుమిగూడినారు.

'ఏరా... పాపోడా! నువ్వేం దిగులు పెట్టుకోగాకు. ఆ చదువు మాని పారేసి యింగ నా కాడ్నే వుండు. మీ నాయన్ను సాకినట్లే నిన్నూ సాకుతా. నీకు డ్రైవింగ్ వస్తాదని చెప్పినారు. నా జీపుకే పెట్టుకుంటా. నమ్మకంగా వుండు. నీకేం కావాల్నా సమస్తం నేనిస్తా. శవాన్ని జీపుకెక్కించి జరగాల్సిన కార్యం జూడు' చెప్పినాడు రోశిరెడ్డి భుజం తట్టా.

కొండయ్య శవాన్ని స్టేషన్లోంచి తెచ్చి జీపులోకెక్కించారు. తల్లితో పాటూ గుర్రయ్య కూడా జీపెక్కాడు.

'దీనెమ్మ నాయ్డు ఏమైనా తక్కువోడా, మాలోళ్ళ సామేలు భార్యతో రోశిరెడ్డి మీద కేసు ఇట్లాటిదే వేయిచ్చినాడు. చూడాల ఏమైతాదో' అని అంకన్న అంటాండడు పాన్‌పరాగ్ నములుతా.

స్టేషన్లో రెండు వర్గాల మధ్య పంచాయితీ జరుగుతానే వుంది. పల్లెలో ఎప్పుడేం జరుగుతాదో తెలియకుండా వుండాది.

ఇప్పుడు గుర్రయ్యగాడు రోశిరెడ్డి పక్కనే చేరి శకునిలాగా రోశిరెడ్డిని పతనం చేస్తాడని, అదును చూసి లేపి నాయుడోళ్ళే లేపినారని చెప్తాడని కొందరు, కాదు ఈసారి నాయుడు దగ్గర చేరి రోశిరెడ్డి మీద పగ తీర్చుకుంటాడని మరికొందరు పల్లెలో రకరకాలుగా అనుకుంటా వుండారు.

పాపాఘ్ని యేట్లో కొండయ్యను బూడ్సి కాశ్యమంతా అయిపోయినాంక తల్లితో కల్సి గుడిసెకు చేరినాడు గుర్రయ్య.

రాత్రంతా వర్షం కురుస్తానే వుంది.

స్టేషన్లో రెండు వర్గాల మధ్య ఎస్సై సమక్షంలో చర్చలు జరుగుతానే వుండాయి.

ఎమ్మెల్యే గూడా వచ్చినాడు.

ఒకరు మీద ఒకరు పెట్టించిన కేసులు ఎత్తేసి ఇద్దరూ ఒక ఒప్పందానికి వచ్చేటట్లు పంచాయితీ కుదిరింది. ఈసారి సర్పంచుగా రోశిరెడ్డినే ఏకగ్రీవంగా ఎన్నుకునేటట్లు తర్వాత టర్న్ సర్పంచుగా నాయుడికి అవకాశం ఇచ్చేటట్లు ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించినాడు.

రెండు వర్గాల మనుషులు సంతృప్తిగా స్టేషన్నుంచి పల్లెదిక్కు కదిల్నారు.

నాల్గు రోజుల తర్వాత రోశిరెడ్డి కాన్నుంచి గుర్రయ్యకు పిలుపొచ్చింది.

'నువ్వేం బాధపడగాకురా... నాయ్డుగాడు మళ్ళా తోక ఆడిస్తే కేసుపెట్టను నువ్వూ, మీ అమ్మ సిద్ధంగా వుండండి. ఈసారి వాడ్ని వదిలేదిలేదు. మీ ఇండ్లలో వాళ్ళెవరూ వాని దిక్కు పోకుండా జూడండి.

రేపట్నుంచి నువ్వు నా జీపుకు డ్రైవరుగా పనిలోకి ఎక్కు. అదును చూసి వాడ్ని దెబ్బ కొడ్దాం' అని చెప్పి కళ్ళు ఎగరేసినాడు రోశిరెడ్డి. రోశిరెడ్డి మాయ మాటల్లోని మర్మం అర్థమైంది.

పాపాఘ్ని నది మోరీ పక్కనుండె నెంబ్రాయి తడికళ్ళలో ఇంకా మెదుల్తానే వుంది.

'అట్నేలేయ్యా నువ్వన్నెట్లు అదును కోసం చూపెట్టుకొని వుందాం' అని నమ్మకంగా చెప్పి ఆన్నుంచి ఇనుపగేటు తెరచుకొని బయటికొచ్చినాడు గుర్రయ్య. రాత్రి వచ్చిన గాలీ వానకు గంగమ్మ గుడి మోట్లోని కానుగచెట్టు విరిగిపడ్తాదని అందరూ అనుకున్నారు. తెల్లారిన తర్వాత చూస్తే శిఖరంలా గంభీరంగా తలెత్తుకొని కన్పించింది.

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం.
* మీ రచనలు పంపించవలసిన చిరునామా:

**ఆదివారం వార్త**
ఎడిటర్
'వార్త' తెలుగు దినపత్రిక
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్ - **500 080**